సాక్షి ప్రకాశం

గురువారం । 14 । డిసెంబర్ । 2023



ఏసీబీ వలలో వీఆర్వో

పొలం మ్యుటేషన్ చేసి, పాస్‌పుస్తకం ఇచ్చేందుకు రూ.35 వేలు లంచం తీసుకుంటున్న ముండ్లమూరు మండలం పోలవరం వీఆర్వో ఏసీబీకి పట్టుబడ్డాడు.

- IIలో..



పాప ప్రక్షాళనకే క్రీస్తు జననం

లోకుల పాప ప్రక్షాళన చేసి రక్షించేందుకే ఏసుక్రీస్తు జన్మించారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
30.4/22.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఉగ్రదాడిలో అశువులు బాసిన వారికి ఎంపీ మాగుంట నివాళి



పార్లమెంట్‌పై జరిగిన దాడిలో అమరులైన వారికి నివాళులర్పిస్తున్న ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు: పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడిలో అశువులు బాసిన అమరులకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం పార్లమెంట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివాళులర్పించారు. 2001 డిసెంబర్ 13న పార్లమెంట్‌పై నాడు ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాడు ఉగ్రవాదులను దీటుగా ఎదుర్కొని ప్రాణాలు కోల్పోయిన వారికి ఎంపీ నివాళులర్పించారు.

రేపు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15న అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనకబడిన తరగతులు సంక్షేమం, సాధికారిత అధికారి ఎం.అంజిలి తెలిపారు. పట్టణంలోని సీవీఎన్ రీడింగ్ రూమ్ ఎదురుగా తాతా బిల్డింగ్ ముందు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి 9.30 గంటలకు, జిల్లా కోర్టు సెంటర్ రోడ్‌లోని అమరజీవి విగ్రహానికి గం .10 కు నివాళులర్పిస్తారని చెప్పారు. కలెక్టర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

దోర్నాలలో రేపు మండల స్పందన

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి శుక్రవారం మండల స్థాయిలో నిర్వహించే స్పందన 15వ తేదీ దోర్నాలలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన దోర్నాలలో బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ వెలిగండ్ల, 29న పెద్దారవీడులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి కలెక్టర్ స్పందనలో జిల్లా అధికారులంతా పాల్గొంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కారం చేసుకోవాలని కోరారు.

చేరువైన ఆధునిక వైద్యం



ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పడకలు

పాపాకాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన లాబొరేటరీ

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రైవేటు వైద్యశాలలకు దీటుగా ఆధునిక వైద్య పరికరాలతో పాటు, క్లినికల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు తగినంత మంది వైద్య సిబ్బందిని నియమించారు. అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉంచడంతో పాటు, మౌలిక వసతులన్నీ కల్పించారు. ఫలితంగా గతంలో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలంటే జంకే ప్రజలు ఇప్పుడు మెరుగైన వైద్యం ఉచితంగానే అందుతుందన్న భరోసాతో వెళ్తున్నారు.

- పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యసేవలు
- వ్యాధి నిర్ధారణకు ఆధునిక వైద్య పరికరాలు
- కిడ్నీ, లివర్, గుండె జబ్బుల నిర్ధారణకు రక్త పరీక్షలు
- బీపీ, షుగర్ మందులతో సహా 174 రకాల ఔషధాల పంపిణీ
- ప్రతి వారం అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు
- 4 నుంచి 6 పడకలు సిద్ధం

ఒంగోలు టౌన్: ఒకప్పుడు ప్రభుత్వ వైద్యశాలలు అంటే ప్రజలకు చిన్నచూపు ఉండేది. చికిత్స కోసం వెళ్లాలంటే జంకే వాళ్లు. ఒకవేళ వెళ్లినా డాక్టర్ సీటు ఖాళీగా దర్శనమిచ్చేది. ఒకరిద్దరు నర్సులు ఉండేవారు. కట్లు కట్టడం, ఇంజక్షన్లు చేయడం మాత్రమే చేసేవాళ్లు. ప్రభుత్వ వైద్యశాలల్లో పారాసిటమాల్, ఐబ్రూఫెన్, బీ కాంప్లెక్స్, మెట్రోనిడజోల్ మందులు మాత్రమే ఉండేవి. రోగులకు సెలైన్ ఎక్కించాలంటే పడకలు ఉండేవి కావు. అందుకే ప్రజలు ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లేవారు కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రైవేటు వైద్యశాలలకు దీటుగా అన్నీ రకాల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. వైద్యులు, నర్సుల కొరత లేదు. పైగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ ఆధునిక లేబొరేటరీ సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు ఇప్పుడు ధీమాగా ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్తున్నారు. మంచి వైద్య సేవలు పొందుతున్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన సేవలు: జిల్లాలో మొత్తం 18 డా.వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలుండగా జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో తొమ్మిది కేంద్రాలున్నాయి. నగరంలోని పాపా కాలనీ, వెంకటేశ్వర కాలనీ, రాజీవ్ గృహకల్ప, గుడిమెళ్లపాడు, బాలాజీ నగర్, మంగమూరు డొంక, వెంగముక్కలపాలెం, పీర్ల మాన్యంలో యూపీహెచ్‌సీలు ఉన్నాయి. 9 సచివాలయాల పరిధిలో ఒకటి చొప్పున పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. పట్టణానికి చుట్టూ శివారు ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో ఈ వైద్యశాలలో వైద్యుల కొరత తీవ్రంగా ఉండేది. ఇప్పుడు అన్నీ యూపీహెచ్‌సీల్లో వైద్యులను నియమించారు. వైద్యులనే కాకుండా ప్రతి ఆరోగ్య కేంద్రంలోనూ ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక్కొక్కరు చొప్పున ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. అంటే ఒక్కో ఆరోగ్య కేంద్రంలో ఏడుగురు సిబ్బంది ఉన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో 4 నుంచి 6 పడకలను ఏర్పాటు చేశారు. జనరల్ వార్డు పడకలు 6, పీడియాట్రిక్ 1, కాన్పుల కోసం 1 పడకలను ఏర్పాటు చేశారు.



ఆస్పత్రిలో రోగులను పరీక్షిస్తున్న డా.రంగకుమార్

ఆధునిక పరికరాలతో 64 రకాల పరీక్షలు: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఆధునిక వైద్య పరికరాలతో వైద్య పరీక్షలను నిర్వహించేందుకు లేబొరేటరీలను ఏర్పాటు చేశారు. ఈ లేబొరేటరీల్లో రోగ నిర్ధారణకు అవసరమైన 64 రకాల పరీక్షలను చేస్తున్నారు. సీబీపీ, ఎల్ఎఫ్‌టీ (లివర్ పరీక్షలు), ఆర్ఎఫ్‌టీ (కిడ్నీ పరీక్షలు), లిపిడ్ ప్రొఫైల్ (గుండె జబ్బుల పరీక్షలు)లతో పాటుగా షుగర్, ఈఎస్ఆర్, సిరమ్ ఎలక్ట్రోలైట్స్, టీబీ పరీక్షలు చేస్తున్నారు. అలాగే హెచ్ఐవీ, హెపటైటిస్ బీ, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, ప్రెగ్నెన్సీ పరీక్షలను చేశారు. దీంతో పాటు వీడీఆర్ఎల్, యూరిన్ రొటీన్, యూరిన్ ఆల్బుమిన్ పరీక్షలు కూడా చేస్తున్నారు. గుండె జబ్బుల్లో అత్యంత కీలకమైన ఈసీజీ పరీక్షను అందుబాటులో ఉంచారు. ప్రతి లేబొరేటరీలోనూ సెల్ కౌంటర్, హెమటాలజీ, బయోకెమిస్ట్రీ, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్లను ప్రభుత్వం సమకూర్చింది. దాంతో ప్రైవేటు లేబొరేటరీలకు ఏమాత్రం తీసిపోకుండా రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. ప్రైవేటు లేబొరేటరీల్లో సుమారు రూ.4 వేలకు పైగా ఫీజు వసూలు చేసే పరీక్షలన్నీ ఇక్కడ పూర్తిగా ఉచితంగా చేస్తారు. దీంతో ప్రజలపై పెద్ద భారం తగ్గినట్లే.

అందుబాటులో కుక్కకాటు ఇంజక్షన్లు: డా.వైఎస్సార్ పట్టణ ఆరోగ్యం కేంద్రంలో కుక్కకాటు ఇంజక్షన్లు అందుబాటులో ఉంచారు. నగరంలోని పాపా కాలనీలో ఆరోగ్య కేంద్రంలో నెలనెలా కనీసం ఐదుగురికి కుక్కకాటుకు యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఇంజక్షన్లు వేస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. అలాగే ఇక్కడ పాము కాటుకు యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అంతే కాకుండా ప్రజలకు అవసరమైన బీపీ, షుగర్, నొప్పులు, గ్యాస్ట్రబుల్ తదితర వ్యాధులకు సంబంధించి 174 రకాల మందులను కూడా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

ప్రతినెలా 14న హెల్త్ మేళా: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెలా 14వ తేదీ హెల్త్ మేళా నిర్వహిస్తారు. హెల్త్ మేళా సమయంలో ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశా కార్యకర్తలు కనీసం 20 మందిని చికిత్స కోసం తీసుకురావాలి. అలాగే ప్రతి నెలా 9వ తేదీ గర్భిణుల కోసం పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రక్త హీనత, ఆరోగ్యం బాగాలేని గర్భిణులను గుర్తించి వారిని ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తారు. అక్కడ వారికి హిమోగ్లోబిన్, యూరిన్ అల్బుమిన్ పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి ఐరన్ సుక్రోజ్ పెట్టి పంపిస్తారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తారు. ఆరోజు పరిసర ప్రాంతాల్లోని ఇళ్లలో ఎక్కడైనా నీరు నిల్వ ఉందేమో పరిశీలిస్తారు. డెంగీ దోమల లార్వాలు ఉన్నాయేమో చూస్తారు. మంగళ, శుక్రవారాలు వెక్టార్ కంట్రోలు హైజిన్ ప్రోగ్రాం నిర్వహించి పారిశుధ్య పరిస్థితులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తారు. తద్వారా వ్యాధి నిరోధానికి అవసరమైన చర్యలను తీసుకుంటారు. మొత్తం మీద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న జాగ్రత్తలు, చూపెడుతున్న శ్రద్ధ పట్ల ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోంది.

ప్రజల ఆరోగ్యానికి ఎనలేని ప్రాధాన్యత

ప్రతి రోజు ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి ఆరోగ్యం గురించి వాకబు చేస్తారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు ఏవైనా ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని వైద్యుల దృష్టికి తీసుకొని వస్తారు. డాక్టర్ సూచించిన మందులను ఆశా కార్యకర్తలు తీసుకొని వెళ్లి స్వయంగా అందజేస్తారు. ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే వెంటనే ఆన్‌లైన్‌లో ఓపీ రాస్తారు. అవసరమైతే సదరు రోగిని ఆశా కార్యకర్తలే స్వయంగా తీసుకొచ్చి చికిత్స చేయిస్తారు. ప్రత్యేక పర్యవేక్షణలో టీబీ రోగులకు చికిత్స అందిస్తున్నారు. టీబీ చికిత్స తీసుకుంటున్న రోగుల ఇంటికి ప్రతి రోజు ఆశా కార్యకర్తలు వెళ్లి ఏ రోజుకారోజు మందులు తీసుకున్నారో లేదో పరిశీలిస్తారు. ఒకవేళ ఏదైనా కారణం చేత సదరు రోగి మందులు తీసుకోకపోతే దగ్గరుండి మరీ మందులు తీసుకునేలా చేస్తారు. టీబీ సూపరింటెండెంట్ ప్రతి నెలా రోగి ఇంటిని సందర్శిస్తారు.

ఇంటి చెంతే ఆరోగ్య సేవలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తోంది. అన్నీ రకాల సౌకర్యాలు, ఔషధాలు, పరీక్షలను సమకూర్చింది. దీంతో ఇప్పుడు ప్రజలకు ఇంటి చెంతనే మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తారు. నాణ్యమైన వైద్య సేవలు అందుతుండడంతో చికిత్స కోసం ప్రజలు ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్నారు. మా కేంద్రంలో ప్రతి రోజు కనీసం 30 నుంచి 40 మంది వరకు వైద్య సేవల కోసం వస్తుంటారు. వారికి అవసరమైన వైద్యం అందిస్తారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం టీచింగ్ ఆస్పత్రులకు పంపుతారు.

– డాక్టర్ రంగకుమార్ యాదవ్, మెడికల్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ, పాపాకాలనీ, ఒంగోలు.

వైద్య సేవలు బాగున్నాయి



గతంలో కంటే ఇప్పుడు ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్య సేవలు బాగున్నాయి. వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. భరోసా కల్పిస్తూ చక్కటి వైద్యం చేస్తున్నారు. వైద్య కోసం ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి గంటల తరబడి కూర్చుని వేల రూపాయలు ఖర్చు చేసుకునే బాధ తప్పింది. లేబొరేటరీలో షుగర్ పరీక్షలు కూడా చేస్తున్నారు. ప్రతినెలా పరీక్షలు చేయించుకోవాలంటే ల్యాబ్ ఫీజులు భరించలేని పరిస్థితి ఉండేది. ప్రభుత్వం నిరుపేదల వైద్యం కోసం శ్రద్ధ చూపడం మంచి విషయం.

– షేక్ జీనత్, ఇస్లాంపేట, ఒంగోలు


ఉద్యోగుల శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు

- సీఎం వైఎస్ జగన్ నిరంతరం ప్రభుత్వ ఉద్యోగుల మంచి కోరే నేత
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల శ్రేయస్సే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక ఒంగోలు తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఒంగోలు ఉప ఖజానా కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటాలో ఉన్న ముఖ్యమంత్రి డెవలప్‌మెంట్ ఫండ్స్ (సీఎండీఎఫ్)ను కేటాయించి ఆర్‌ఓ ప్లాంటును నిర్మించారన్నారు. అందుకోసం తన నిధుల నుంచి రూ.6.40 లక్షలు విడుదల చేశామని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో సుదీర్ఘ కాలం పాటు పనిచేసి పదవీ విరమణ పొందిన దాదాపు 8 వేల మంది పింఛనుదారులకు తాగునీటి అవసరం కల్పించటం తన అదృష్టంగా భావిస్తున్నానని బాలినేని సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఆర్‌ఓ ప్లాంటు ద్వారా పింఛనుదారులకు దాహార్తి తీరుతుందన్నారు. అదే విధంగా ఖజానా శాఖ అధికారులు కోరిన వెంటనే ఈ కార్యాలయానికి నీటి కుళాయి సౌకర్యం కూడా కల్పించామన్నారు. జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఏ.జగన్నాథరావు మాట్లాడుతూ పింఛనుదారులకు మంచి నీటి వసతి కల్పించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. గతంలో ఉప ఖజానా కార్యాలయానికి నిధులు తక్కువగా ఉన్నాయని చెప్పిన వెంటనే ప్రభుత్వంతో మాట్లాడి అదనపు నిధులు కూడా మంజూరు చేయించారని గుర్తు చేశారు. జిల్లా సహాయ ఖజానా అధికారి కాజా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల శ్రేయస్సే తమ లక్ష్యమని వారి సమస్యలు పరిష్కరించటంలో బాలినేని ముందుంటారన్నారు. పెన్షనర్ల సంఘ రాష్ట్ర నాయకుడు కే.ఆల్‌ఫ్రెడ్ మాట్లాడుతూ యావత్ ఉద్యోగ లోకానికి, పెన్షనర్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పురిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్న నేత బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. అనంతరం ఏపీటీసీఏ ప్రకాశం జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో బాలినేనిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహాయ ఖజానాధికారి కే.ఎలీషారాణి, ఏపీటీసీఏ జిల్లా శాఖ నాయకులు పీవీ.నారాయణ, ఎస్‌కే.అబ్దుల్ ఖాదర్, పి.కోటి సుధీర్, ఉప ఖజానాధికారి డి.రాజ్యలక్ష్మి, పెన్షనర్ల సంఘం నాయకులు అంకిరెడ్డి, పి.హనుమంతరావు, సుబ్బారావు, రఘురామిరెడ్డితో పాటు ఖజానా కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కార్తీక మాసం ముగిసిన తరువాత వచ్చిన పాడ్యమి రోజును పోలిపాడ్యమి లేదా పోలిస్వర్గం అంటారు. ఈ సందర్భంగా బుధవారం వేకువజామున జిల్లాలోని పలుప్రాంతాల్లో మహిళలు పెద్ద ఎత్తున నీటిలో దీపాలు వదిలి పోలికి మొక్కుకున్నారు. - సాక్షి, ఒంగోలు

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన వారి వివరాలివ్వాలి

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను నేషనల్ పోర్టల్‌లో ఈనెలాఖరులోగా నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ వివరాలను ఒక్క అక్షరం కూడా తప్పులు లేకుండా మెరిట్ కార్డుపైన ముద్రించిన విధంగానే ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్‌లో ఒకే విధంగా ఉండేలా సరిచూసుకోవాలన్నారు. మెరిట్ కార్డుపై వివరాలు తప్పుగా ఉన్నట్లయితే సంబంధిత పాఠశాల వారు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మిస్ మ్యాచ్ వివరాలను ఇవ్వాలన్నారు. విద్యార్థి పేరు, పుట్టినతేదీ, తండ్రిపేరు, ఒక్క అక్షరం తేడా ఉన్నా మిస్‌మ్యాచ్ ప్రొఫార్మాలో ఇవ్వాలన్నారు. అదే విధంగా 2019 నవంబరు, 2021 ఫిబ్రవరి, 2022 మార్చి సంవత్సరాల్లో ఎంపికైన విద్యార్థులు తమ వివరాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు. ఈప్రక్రియ పూర్తికానట్లయితే సంబంధిత విద్యార్థులకు ఉపకార వేతనం మంజూరు చేయరని చెప్పారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు విజయ కృష్ణన్
- సంక్షేమ వసతి గృహం ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న విజయ కృష్ణన్

ఒంగోలు సెంట్రల్: విద్యార్థినులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యం ఏర్పరుచుకుని అది సాధించటానికి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు విజయ కృష్ణన్ కోరారు. ఒంగోలు పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల (ఆనంద నిలయం) వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి చక్కగా భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని కోరారు. ప్రభుత్వం మంచి వసతి, విద్య అందిస్తుందని, వాటిని ఉపయోగించుకొని రాణించాలని సూచించారు. వసతి గృహంలో మెనూ, వసతి, శుభ్రత పై విద్యార్థినులను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలు బాగుందని వారు చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహ సంక్షేమ అధికారిణి దుర్గా లక్ష్మిని కూడ అభినందించారు. ఆమె వెంట జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎస్ లక్ష్మా నాయక్, సహాయ సాంఘిక అధికారి ఉదయశ్రీ, వసతి గృహ సంక్షేమాధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు డీ అంకబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను తరలిస్తూ పట్టుబడిన వ్యక్తులు

గిద్దలూరు రూరల్: కర్నాటక రాష్ట్రం నుంచి మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులతో పాటుగా రెండు ద్విచక్రవాహనాలను సెబ్ సీఐ అరుణకుమారి స్వాధీనం చేసుకున్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి రైలులో అక్రమంగా మద్యం బాటిళ్లను తరస్తున్నారని సమాచారం అందడంతో గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో రెక్కీ నిర్వహించి సోదాలు నిర్వహించారు. అందులో కంభంకు చెందిన ఒక వ్యక్తి, గిద్దలూరు మండలం పాదలకుంటపల్లెకు చెందిన వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నారు. అనంతరం కంభం రైల్వేస్టేషన్‌లో బేస్తవారిపేట మండల ఎంపీచెరువుకు చెందిన మరో వ్యక్తి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారి వద్ద నుంచి మొత్తం 60 మద్యం బాటిళ్లతో పాటుగా రెండు ద్విచక్రవాహనాలు సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్ సమీపంలో మోటార్‌సైకిల్‌ను బోలేరో వాహనం ఢీకొట్టిన సంఘటనలో తీవ్ర గాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న బేస్తవారిపేట చెందిన సీపీఐ పార్టీ మండల కన్వీనర్ బొల్లా బాలిరెడ్డి(54) మృతి చెందారు. ఈనెల 9వ తేదీన మోటార్‌సైకిల్‌పై హైవేరోడ్డును దాటుతున్న సమయంలో కొమరోలు వైపు నుంచి బేస్తవారిపేటకు పత్తిలోడు కోసం వెళ్లే బోలేరో వాహనం రాంగ్‌రూట్‌లో వెళ్లి వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బాలిరెడ్డి తల పగిలి, కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్సపొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య సావిత్రి పూసలపాడు పీహెచ్‌సీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తుంది. ఒక కుమారుడు ఉన్నాడు.

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా రహీంబాషా

ఒంగోలు: వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన ఎస్కే రహీం బాషాను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది.



మార్కాపురం చెన్నకేశవ ఆలయ కొనేరులో దీపాలు వదులుతున్న మహిళలు


భక్తితో.. పోలి పాడ్యమి

పోలి పాడ్యమి సందర్భంగా బుధవారం వేకువ జామున ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పోలి స్వర్గం నాడు అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి గంగలో వదిలితే మాసమంతా పూజలు చేసిన ఫలితం దక్కుతుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో మహిళలు దీపాలు వదిలి పెద్దల ఆశీర్వాదం తీసుకోవడంతోపాటు తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేకంగా నీటి తొట్లు ఏర్పాటు చేసి దీపాలు వదిలారు.

– సాక్షి నెట్‌వర్క్



ఒంగోలు: అప్పాయికుంట వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు





ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద దీపాలు వదులుతూ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటూ..



తాంబూలం ఇచ్చిపుచ్చుకుంటూ..



కొండపి : ఉప్పలపాడులో నీటి తొట్టిలో దీపాలు విడిచిపెడుతున్న మహిళలు

పాప ప్రక్షాళన కోసమే క్రీస్తు జననం

- రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి సురేష్
- పెద్దదోర్నాలలో ఘనంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దదోర్నాల: లోకంలో పాపులను రక్షించేందుకే క్రీస్తు జన్మించాడని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం రాత్రి నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రేమతత్వాన్ని నెలకొల్పిన క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమన్నారు. ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి ఏసు క్రీస్తు అని కొనియాడారు. యువత త్యాగం, సేవ, ప్రేమ గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ ప్రసంగీకులు బ్రదర్ శామ్యూల్ దైవ సందేశాన్ని అందించారు. తదనంతరం మంత్రి సురేష్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్యాండిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ దూదేకుల ఖాశింపీరా, మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి, ఏఏఎం ట్రస్ట్ మిషన్ చైర్మన్ జె.జాన్‌బాబు, సర్పంచ్ చిత్తూరి హారిక, దూదేకుల రసూల్, పవన్‌కుమార్, మొద్దు తిరుపతిరావు, చిట్యాల యోగిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి, కిరణ్ కిశోర్ కుమార్, పాస్టర్ల సంఘ గౌరవ అధ్యక్షుడు యలకపాటి ఇశ్రాయేలు, యూనియన్ అధ్యక్షుడు సింగా రాజేష్, ఉపాధ్యక్షుడు సింగా యేసుదానం తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో వీఆర్వో

- పొలం పాస్‌పుస్తకం ఇచ్చేందుకు రూ.35 వేలు డిమాండ్
- లంచం తీసుకుంటుండగా పట్టుబడిన వీఆర్వో రవిశంకర్



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ వి శ్రీనివాసరావు



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన వీఆర్వో రావూరి రవిశంకర్

ముండ్లమూరు: పొలం మ్యుటేషన్, పట్టాదారు పాస్ పుస్తకం మంజూరుకు రూ.35 వేలు లంచం తీసుకుంటున్న ఓ వీఆర్వో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఒంగోలు ఏసీబీ డీఎస్పీ వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణకు చెందిన ఎస్.సత్యవాణి, టి.మనోహర్, మరో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ముండ్లమూరు మండలంలోని పోలవరం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 738–1లో 66 సెంట్లు, 739–2లో 22 సెంట్లు ఎర్రచందనం సాగుచేసిన పొలం కొనుగోలు చేశారు. ఆ పొలాన్ని వారి పేరుతో రెవెన్యూ రికార్డుల్లో మార్చేందుకు మ్యుటేషన్, పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 7న మ్యుటేషన్ చేసేందుకు వీఆర్వో రావూరి రవిశంకర్ వారి నుంచి రూ.45 వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.35 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. లంచం ఇవ్వడం ఇష్టంలేని వారు ఈనెల 9వ తేదీన ఒంగోలు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఏసీబీ అధికారులు రైతుల వేషధారణలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మకాం వేశారు. ముందుగా అనుకున్న ప్రకారం బాధితుల నుంచి వీఆర్వో రూ.35 వేలు లంచం తీసుకునేందుకు కార్యాలయం బయటకు వచ్చారు. లంచం తీసుకుంటున్న వీఆర్వోను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారించారు. బాధితుల భూమికి సంబంధించిన రికార్డులు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీఆర్వోపై కేసు నమోదు చేశామని గురువారం నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. అనంతరం అద్దంకిలోని వీఆర్వో రవిశంకర్ నివాసంలో ఏసీబీ సీఐ అపర్ణ, ఈఓఆర్డీ శ్రీదేవితో కలిసి తనిఖీలు చేపట్టారు. దాడుల్లో ఏసీబీ సీఐలు సీహెచ్ శేషు, ఎస్ఎస్ఎస్ అపర్ణ, టీవీ శ్రీనివాస్, ఎస్ఐ జేబీఎన్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీ అధికారులు దాడి చేశారని తెలియగానే కార్యాలయ ఆవరణలో ఉన్న పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది అక్కడి నుంచి జారుకోవడం గమనార్హం. ముండ్లమూరు మండలంలో రెవెన్యూ అధికారులు తరచూ ఏసీబీకి పట్టుబడుతున్నారు. గతంలో తహసీల్దార్లు ఏవీ ప్రసాదరావు, మల్లికార్జున ప్రసాద్, వీఆర్వోలు రమాదేవి, శ్రీనివాసరెడ్డి, సరోజని, గుంటూరి బాబు, డీటీ రమణయ్య ఏసీబీకి పట్టుబడ్డారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

- విద్యార్థులకు సేవలందించడంలో బూచేపల్లి ట్రస్ట్ ముందుంటుంది
- ఎస్సీ బాలికల హాస్టల్, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హామీ
- మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి స్టడీ మెటీరియల్ పంపిణీ



చీమకుర్తి జెడ్పీ హైస్కూల్‌లో మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి బుధవారం చీమకుర్తిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, దేవరపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. తమ ట్రస్ట్ ద్వారా గత ఏడెనిమిదేళ్లుగా చీమకుర్తి మండలం, దర్శి నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ హైస్కూళ్లతో పాటు జిల్లాలోని గురుకుల పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సేవలో బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. చీమకుర్తి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి గతంలో జెడ్పీ నుంచి మంజూరు చేసిన రూ.5 లక్షలకు అదనంగా మరో రూ.5 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. చీమకుర్తిలోని బాలికల హాస్టల్లో మౌలిక వసతుల కల్పనకు జెడ్పీ నిధులను కేటాయించడంతోపాటు, బాలికల హైస్కూల్లో త్వరలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, చీమకుర్తి సొసైటీ ప్రెసిడెంట్ గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కౌన్సిలర్లు పత్తి కోటేశ్వరరావు, పాలపర్తి వెంకట్రావు, మేకల యల్లయ్య, హెచ్ఎం వీరాస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దేవరపాలెం హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బూచేపల్లి నాగిరెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పులి వెంకటరెడ్డి, హెచ్ఎం భాస్కర్ శాస్త్రి, టీచర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి



ముండ్లమూరు కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

ముండ్లమూరు: పాఠశాలల్ఓల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి. దేవి అన్నారు. మండలంలోని పెద ఉల్లగల్లు, ముండ్లమూరు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పెద ఉల్లగల్లులో రేషన్‌కార్డుదారులకు వాహనం ద్వారా రేషన్ బియ్యం సరఫరా చేస్తుండగా మహిళలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సరుకులు సకాలంలో అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. బియ్యానికి బదులు నగదు ఇస్తామని ఎవరైనా అంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్లు తక్కువ బరువు ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి గుడ్లు తింటే విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. వెంటనే గుడ్లు సరఫరా చేసే ఏజెన్సీతో మాట్లాడి గుడ్లు మార్చాలని అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ ప్రభాకర్‌రావును ఆదేశించారు. అనంతరం ముండ్లమూరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అక్కడ నాణ్యత లేని చిక్కీలు, కాలం చెల్లిన రాగి పిండి ప్యాకెట్లు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదన్నారు. కాలం చెల్లిన పిండి సరఫరా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం బాలికలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పురుగుల అన్నం, పురుగుల సాంబారు తినలేక పోతున్నామని విద్యార్థులు వాపోయారు. అసలు పండ్లు ఇవ్వడం లేదన్నారు. అనంతరం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యలపై చర్చించారు. బియ్యంలో పురుగులు వస్తే మార్చుకునే వెసులుబాటు ఉందా లేదా అని డీఎస్ఓ ఉదయభాస్కర్‌ను అడగ్గా వెసులుబాటు ఉందని తెలిపారు. ఆదర్శ పాఠశాలలోనూ విద్యార్థుల భోజనం విషయంలో ఇబ్బందులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలలో డిఎస్ఓ ఉదయభాస్కర్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ మొహిసన్, జీసీడీఓ మాధవీలత, డీఈఓ కారాలయ ఏడీ ఉదయభాస్కర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అశోక్‌కుమార్, తహసీల్దార్ నయీంఅహ్మద్, ఎంపీడీఓ హనుమంతరావు, కేజీబీవీ స్పెషలాఫీసర్ ఆవుల సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి.దేవి కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం స్పెషలాఫీసర్ సుజితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బీసీ వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహం, రేషన్ దుకాణాన్ని ఆమె బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఎంఈఓ సుబ్బయ్య, ఎంపీడీఓ కె.యుగకీర్తి, వార్డెన్ నరసింహారావు, వైద్యాధికారి మస్తాన్‌బీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- మరో మహిళకు తీవ్ర గాయాలు
- ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన బైక్
- పెద్దారవీడు మండలం తోకపల్లి–గొబ్బూరు మధ్య ఘటన



సంఘటనా స్థలంలో అశోక్, రామాంజనేయులు మృతదేహాలు

పెద్దారవీడు: ఎదురుగా వస్తున్న కారును ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పెద్దారవీడు మండల పరిధిలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కురిచేడు మండలం పడమరనాయుడిపాలెం గ్రామానికి చెందిన బత్తుల రామాంజనేయులు, నారమ్మ దంపతులు వరుసకు మనుమడైన పామురి అశోక్‌తో కలిసి బైక్‌పై మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో తోకపల్లి–గొబ్బూరు మధ్య ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బత్తుల రామాంజనేయులు(50), పామురి అశోక్(18) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన బత్తుల నారమ్మను 108 వాహనంలో మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నారమ్మను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వృద్ధుడు..

దర్శి(కురిచేడు): ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం దర్శి–వీరాయపాలెం మధ్య చోటుచేసుకుంది. వివరాలు.. దర్శి మండలం వీరాయపాలేనికి చెందిన శ్యామసుందరరావు(70) వ్యక్తిగత పనుల నిమిత్తం దర్శి వచ్చి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. అదే మార్గంలో వెళ్తున్న వాహనదారులు గమనించి 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది కురంగి నరేష్‌బాబు, షేక్.గౌస్‌బాషా ప్రథమ చికిత్స చేశారు. దర్శి ప్రభుత్వ వైదశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో శ్యామసుందరరావు మృతి చెందాదని 108 సిబ్బంది తెలిపారు.

ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



కమిషనర్‌కు మొక్క బహూకరిస్తున్న ఏఎస్‌ఐ

దొనకొండ: స్థానిక రైల్వేస్టేషన్‌లోని ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్‌ను గుంటూరు రైల్వే డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ కె.సత్య వరప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లను తనిఖీ చేస్తున్నారు. రైలు ప్రమాదాలు, ప్రయాణికులు రైలు ఎక్కు విధానం, పట్టాల మధ్యలో గేదెలు వెళ్లడంతో జరిగే సంఘటనలు, లెవెల్ క్రాసింగ్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైలులో సరైన కారణాలు లేకుండా చైన్ లాగడం, టపాకాయలు తీసుకెళ్లడంతో జరిగే ప్రమాదాల గురించి ఆర్‌పీఎఫ్ సిబ్బంది జాగ్రత్తగా ఉండాలన్నారు. పలు సూచన, సలహాలందించారు. రాత్రి వేళల్లో స్త్రీల ప్రత్యేక బోగీలో గుర్తు తెలియని వ్యక్తులు ఎక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌లలో రైలు బండి ఆగినప్పుడు మహిళలు కూర్చున్న కిటికీ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అటు ఇటు తిరుగుతున్న వారిని గమనించి అదుపులోకి తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో విద్యార్థులు, చిన్న పిల్లలు ఇంటి వద్ద నుంచి, వసతి గృహాల నుంచి అలిగి వచ్చి రైలు ఎక్కుతుంటారని, వారిని గమనించి అదుపులోకి తీసుకుని సంబంధిత తల్లిదండ్రులకు అప్పగించాల్సిన బాధ్యత ఉందన్నారు. తొలుత స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సత్యవరప్రసాద్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏఎస్‌ఐ డీఎస్ క్రాంతికుమార్ ఉన్నారు.

పర్యావరణం



శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి.
– లిసిప్రియ

నిండు సభలో... నిగ్గదీసి అడిగిన అగ్నిస్వరం

వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే మురిసే చిన్నారి హృదయాలకు ప్రకృతి ఆత్మీయ నేస్తం. అలాంటి అందమైన, ఆత్మీయమైన ప్రకృతి ఎదుట విలయ విధ్వంసం కరాళనృత్యం చేస్తుంటే... లిసిప్రియలాంటి చిన్నారులు 'పాపం, పుణ్యం ప్రపంచ మార్గం' అని ఊరుకోరు. ప్రకృతికి సంబంధించి మనం చేస్తున్న పాపం ఏదో, పుణ్యం ఏదో కళ్లకు కట్టేలా ప్రచారం చేస్తారు. దుబాయ్‌లో జరిగిన 'యునైటెడ్ నేషన్స్ క్లైమెట్ చేంజ్ కాన్ఫరెన్స్-2023'లో తన నిరసనను బహిరంగంగా తెలియజేసింది మన దేశానికి చెందిన పన్నెండు సంవత్సరాల లిసిప్రియ కంగుజామ్. 'శిలాజ ఇంధనాలను అంతం చేయండి... భవిష్యత్తును, భూగోళాన్ని కాపాడండి' అంటూ నినదించింది. కొద్దిసేపు ప్రసంగించింది. ఆమె నిరసనను ప్రపంచ ప్రతినిధులు కొందరు చప్పట్లతో ఆమోదం పలికారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన మణిపూర్‌కు చెందిన క్లైమెట్ యాక్టివిస్ట్ లిసిప్రియ గురించి....

లిసిప్రియ కంగ్‌జామ్ మణిపూర్‌లోని బషిక్‌హోంగ్‌లో జన్మించింది. తల్లిదండ్రుల ద్వారా, స్కూల్లో ఉపాధ్యాయుల ద్వారా విన్న పర్యావరణపాఠాలు ఈ చిన్నారి మనసుపై బలమైన ప్రభావాన్ని చూపాయి. పర్యావరణ సంరక్షణ కోసం తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది. ఏడు సంవత్సరాల వయసులోనే అందరూ ఆశ్చర్యపడేలా పర్యావరణ సంబంధిత విషయాలు మాట్లాడేది.

నా నేరం ఏమిటి?

నిరసన తరువాత అధికారులు నన్ను 30 నిమిషాలకు పైగా నిర్బంధించారు. నేను చేసిన నేరం ఏమిటంటే పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణం అయిన శిలాజ ఇంధనాలను దశల వారీగా తొలగించమని అడగడం. నన్ను 'కాప్ 28'లో లేకుండా చేశారు.

– లిసిప్రియ, యాక్టివిస్ట్

యాక్ట్ నౌ

దుబాయ్‌లో జరిగిన క్లైమేట్ కాన్ఫరెన్స్-2023లో 190 దేశాల నుంచి 60,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చిన్నారి ప్రియ ధైర్యంగా వేదిక మీదికి వచ్చి 'అవర్ లీడర్స్ లై. పీపుల్ డై' అని గట్టిగా అరిచింది. సదస్సు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ తరువాత ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి.

'ఎవరు ఈ అమ్మాయి?' అంటూ చాలామంది ఆరా తీశారు. చిన్న వయసు నుంచే పర్యావరణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహిస్తున్న ప్రియ గురించి తెలుసుకొని ఆశ్చర్యానందాలకు గురయ్యారు.

2018లో ప్రకృతి విధ్వంసంపై మంగోలియాలో ఐక్యరాజ్య సమితి నిర్వహించిన సదస్సులో తండ్రితో కలిసి పాల్గొంది. ఈ సదస్సులో వక్తల ఉపన్యాసాల నుంచి ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంది.

ఈ సదస్సు ప్రియ జీవితాన్ని మార్చేసిన సదస్సు అని చెప్పవచ్చు.

ఈ సదస్సు స్ఫూర్తితో 'చైల్డ్ మూమెంట్' అనే సంస్థను మొదలుపెట్టింది. మొక్కల పెంపకం వల్ల ప్రకృతికి జరిగే మేలు, ప్రకృతి విధ్వంసం వల్ల జరిగే నష్టాలు... మొదలైన వాటి గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో స్కూల్స్‌లో ప్రచారకార్యక్రమాలు విరివిగా నిర్వహించింది.

2019లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంది. ఇదే సంవత్సరం అంగోలా దేశంలో జరిగిన ఆఫ్రికన్ యూనియన్ సదస్సులో పాల్గొంది. ఈ సదస్సులో ఎంతోమంది దేశాధ్యక్షులతో పాటు ప్రియ ప్రసంగించడం విశేషం.

చిన్నవయసులోనే ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు తెచ్చుకుంది లిసిప్రియ.

ప్రియకు డబ్బులను పొదుపు చేయడం అలవాటు. అవి తన భవిష్యత్ అవసరాలకు ఉద్దేశించి కాదు. సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం కోసం పొదుపు చేస్తుంటుంది. 2018లో కేరళ వరద బాధితులకు సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయలు విరాళంగా ఇచ్చింది. ఢిల్లీలోని వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని 'సర్వైవల్ కిట్ ఫర్ ది ఫ్యూచర్' అనే డివైజ్‌కు రూపకల్పన చేసింది. ఈ జీరో బడ్జెట్ కిట్ వాయుకాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఎవరైనా, ఎక్కడైనా సులభంగా తయారు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని పంజాబ్ అసెంబ్లీలో లాంచ్ చేసింది ప్రియ. వాతావరణ మార్పులపై కార్యచరణ కోసం, మన దేశంలో క్లైమెట్ లా కోసం వందలాదిమందితో కలిసి ఢిల్లీలోని ఇండియా గేట్ దగ్గర ప్రదర్శన నిర్వహించింది.

'సందేశం ఇవ్వాలనుకోవడం లేదు. సమస్యను అర్థం చేసుకోమని చేతులు జోడించి వినమ్రంగా వేడుకుంటున్నాను' అంటుంది లిసిప్రియ.

న్యూస్‌మేకర్
ఆషిక్



కుమారునికి వంట నేర్పితే? ఏమవుతుంది?

బహుశా 'మాస్టర్ చెఫ్' విజేతగా 25 లక్షలు ఇంటికి తీసుకొస్తాడు. అబ్బాయిలు వంట గదిలోకి వస్తే 'ఏంట్రా ఆడపిల్లలాగా' అని మందలిస్తారు. కాని వంట స్త్రీలకూ, పురుషులకూ రావాలి. పిల్లలు ఎంత బాగా చదువుకున్నా వారికి కొద్దో గొప్పో వంట తెలిసుండాలి. 'మాస్టర్ చెఫ్' తాజా విజేత ఆషిక్ మా అమ్మ నేర్పిన వంట వల్లే గెలిచాను అన్నాడు. మంగళూరులో చిన్న జ్యూస్ షాప్ నడుపుకునే ఆషిక్ ఇంత పెద్ద గెలుపుతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.

'సోనీ లివ్' చానల్ వారి ప్రఖ్యాత రియాలిటీ షో 'మాస్టర్ షెఫ్' సీజన్ 8 ఆడిషన్స్ రౌండ్‌లో ఆషిక్ చేసిన మంగళూరు స్టయిల్ ఫిష్ ఫ్రైను జడ్జీలు వెంటనే ఓకే చేయలేదు. 'కొంత బాగుంది కొంత బాగలేదు. మళ్లీ చెప్తాం' అన్నారు. కాని ఆ తర్వాత ఆషిక్‌కు అవకాశం ఇచ్చారు. అప్పటినుంచి అంటే అక్టోబర్ 18 నుంచి డిసెంబర్ 8 ఫైనల్స్ వరకూ ఆషిక్ చేసిన వంటకాల ప్రయాణం ఉద్వేగభరితంగానే సాగింది. ఎందుకంటే అతడు వంటను శాస్త్రోక్తంగా నేర్చుకోలేదు. అమ్మ దగ్గర ఇంట్లో వంటగదిలో నేర్చుకున్నాడు.

24 ఏళ్ల కుర్రాడు

మంగళూరుకు చెందిన ఆషిక్ వయసు 24 ఏళ్లు. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఇంటర్ తర్వాత హోటల్ మేనేజ్‌మెంట్ చేద్దామనుకున్నాడు. కాని ఫీజు కట్టే పరిస్థితి లేక కట్టలేదు. ఏం చేయాలి. వంట బాగా వచ్చు. యూ ట్యూబ్‌లో చూసి రకరకాల వంటకాలు చేయడం నేర్చుకున్నాడు. దానికి కారణం చిన్నప్పటి నుంచి అతని ఆటలన్నీ వంట గదిలోనే సాగేవి. నానమ్మ వంట చేస్తుంటే అక్కడే కూచుని చెంబులు తప్పేళాలతో ఆడుకునేవాడు. అమ్మ హయాం వచ్చేసరికి వంటలో సాయం పట్టడం మొదలెట్టాడు. తల్లి – 'ఏమిటీ ఆడంగి పనులు' అని తిట్టకుండా కొడుకును ప్రోత్సహించింది. ఇంటికి ఎవరొచ్చినా ఆషిక్ వంట చేసే పద్ధతి చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ ఆత్మవిశ్వాసంతో మంగళూరులో 'కులుక్కి' పేరుతో చిన్న జ్యూస్ షాప్ పెట్టాడు ఆషిక్. అయితే అది సగటు జ్యూస్‌షాప్ కాదు. ఆషిక్ కనిపెట్టిన రకరకాల ఫ్లేవర్లు, మిక్స్‌డ్ కాంబినేషన్లు అందులో దొరుకుతాయి. జనం బాగా కనెక్ట్ అయ్యారు. అతని జ్యూస్ షాప్ మంచి హిట్. కాని ఇంకా జీవితంలో సాధించాలి అంటే ఏదైనా పెద్దగా చేయాలనుకున్నాడు ఆషిక్. 'మాస్టర్ షెఫ్' అందుకు వేదికగా నిలిచింది.

విఫలమైనా ముందుకే

2022 మాస్టర్ షెఫ్ ఆడిషన్స్‌కు వచ్చిన ఆషిక్ రిజెక్ట్ అయ్యాడు. 'చాలా డిప్రెషన్‌లోకి వెళ్లాను. మళ్లీ ఏమీ వండలేననే అనుకున్నాను. కాని సాధించాలి... మనసుపెట్టి పోరాడాలి అని నిశ్చయించుకున్నాను. 2023 ఆడిషన్స్ వచ్చేవేళకు చాలా కష్టపడి తర్ఫీదు అయ్యాను సొంతగా. షో ముందుకు వెళ్లేకొద్దీ సవాళ్లు ఎదురైనా ఛేదిస్తూ విజేతగా నిలిచాను' అన్నాడు ఆషిక్.


తల్లితో ఆషిక్

ఫైనల్స్ ఎపిసోడ్‌లో ఆషిక్ తల్లిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆమె సమక్షంలోనే ఆషిక్‌ను విజేతగా ప్రకటించారు. కొడుకు విజేత అవుతాడో లేదో నని ఆమె ఉత్కంఠగా ఎదురు చూసింది. ఆపై కొడుకు విజయానికి పులకించిపోయింది.

కాగా ఈ సీజన్‌లో మేఘాలయాకు చెందిన స్కూల్ ప్రిన్సిపల్ నంబి మొదటి రన్నర్ అప్‌గా, జమ్ము-కశ్మీర్‌కు చెందిన రుక్సర్ అనే ఫుడ్ టెక్నీషియన్ సెకండ్ రన్నర్ అప్‌గా నిలిచారు. ప్రసిద్ధ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, గరిమా అరోర జడ్జీలుగా వ్యవహరించారు. రొయ్యలతో ఆషిక్ చేసిన 'క్రిస్పీ ప్యారడైజ్' అనే వంటకాన్ని రుచి చూసిన జడ్జ్ రణ్‌వీర్ బ్రార్ తన సంతకం కలిగిన కిచెన్ నైఫ్ బహూకరించడం విశేషం.

హోటల్ రంగంలోగాని, స్వయం ఉపాధికిగాని పాకశాస్త్రం నేడు చాలా అవసరంగా ఉంది. మంచి షెఫ్‌లకు చాలా డిమాండ్ ఉంది. అదెలా ఉన్నా తెల్లారి లేస్తే మూడుపూట్లా తినాలి కనుక, వంట కేవలం ఆడవారి వ్యవహారం అనే భావన పోయి, ఇకమీదైనా అబ్బాయిలకు తల్లులు కనీసం అవసరమైనంత వంట నేర్పడం మంచిది. ఏమో... వారు ఇంకా బాగా నేర్చుకుంటే మరో మాస్టర్ షెఫ్ అవుతారేమో. ఏ ప్లేట్‌కు ఏ పదార్థం రాసి పెట్టుందో ఎవరు (రుచి) చూసొచ్చారు కనుక.

కరకరలాడాలంటే...

కిచెన్‌టిప్స్

బిస్కెట్లు మెత్తగా అవ్వకుండా కరకరలాడాలంటే ఇలా చేసిచూడండి...

- ప్లాస్టిక్, అల్యూమినియం డబ్బాలు, గాజు పాత్రల్లో బిస్కెట్లు, కుకీలను నిల్వచేయాలి. గాలి చొరబడకుండా పెడితే ఎక్కువరోజులపాటు క్రిస్పీగా ఉంటాయి.
- డబ్బాల్లో నిల్వచేసేటప్పుడు అడుగు భాగంలో రెండు మూడు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి తరువాత బిస్కెట్లు పెట్టాలి. బిస్కెట్లపైన మరో రెండు వరుసల్లో టిష్యూపేపర్లు వేసి పైన బిస్కెట్లు పెట్టాలి. ఇలా నిండుగా పెట్టి గాలిచొరబడకుండా మూత పెట్టాలి.
- జిప్‌లాక్ పాచ్‌లలో నిల్వచేస్తే కూడా కుకీలు తాజాగా ఉంటాయి.
- గాలి చొరబడని డబ్బాలు, జిప్‌లాక్ పాచ్‌లను రిఫ్రిజిరేటర్‌లో పెడితే మరిన్ని రోజులు బిస్కెట్లు తాజాగా ఉంటాయి.
- అనుకోకుండా సరిగా నిల్వచేయనప్పుడు మెత్తబడిన కుకీలను అవెన్ లేదా ఎయిర్‌ఫ్రైయర్‌లో ఉంచి వేడి చేస్తే మళ్లీ క్రిస్పీగా మారతాయి. వీటిని కూడా నిల్వచేసుకోవచ్చు.



జుట్టుకు బలాన్నిచ్చే టానిక్

బ్యూటిప్స్ హెయిర్ కేర్

బీట్‌రూట్ ఒకటి తీసుకుని చెక్కు తీసి ముక్కలుగా తరగాలి. రెండు ఉసిరి కాయలను గింజలు తీసేసి ముక్కలుగా కోయాలి. వీటికి పన్నెండు రెమ్మల కరివేపాకు, గ్లాసు నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని పదినిమిషాల పాటు మీడియం మంట మీద మరిగించాలి. చక్కగా మరిగాక దించేసి చల్లారిన తరువాత ఈ రసాన్ని వడగట్టి సీసాలో నిల్వచేసుకోవాలి. ఈ టానిక్‌ను వారానికి రెండు మూడుసార్లు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. రెండు గంటల తరువాత సాధారణ షాంపుతో కడిగేయాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కుదుళ్లకు పోషకాలు అందుతాయి. రక్తప్రసరణ చక్కగా జరిగి జుట్టు ఊడడం తగ్గుతుంది. చివర్లు చిట్లకుండా చక్కగా పెరుగుతాయి.



జెల్ మెరుపులు

టేబుల్ స్పూను పంచదార పొడిలో స్పూను వేడి నీళ్లు పోసి కలపాలి. దీన్లో రెండు టీస్పూన్ల పచ్చి పాలు, స్పూను అలోవెరా జెల్ వేసి కలపాలి. శుభ్రంగా కడిగిన ముఖానికి ఈ మిశ్రమాన్ని రాసి మర్దన చేయాలి. పదినిమిషాలపాటు ఆరనిచ్చి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి తేమ అంది, మృదువుగా నిగారింపుతో కనిపిస్తుంది.



- మరుగుతున్న రెండు గ్లాసుల నీటిలో మూడు టేబుల్ స్పూన్ల టీపొడి, పది గులాబీ పువ్వులు వేసి పదినిమిషాలపాటు మరిగించాలి. ఇది చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోయాలి. తలస్నానం చేసిన జుట్టుకు ఈ డికాషన్‌ను పట్టించి, టవల్ చుట్టుకోవాలి. నీటితో కడగకూడదు. ఇది కండీషనర్‌లా పనిచేసి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

'రోల్' లేదు 'మోడల్' లేదు!

హెల్త్‌కేర్‌లో మహిళలు ఫ్రంట్‌లైన్‌కే పరిమితం

హెల్త్‌కేర్ ఇండస్ట్రీలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే కనిపిస్తున్నారు అని దస్రా ఆర్గనైజేషన్ ఒక డేటా విడుదల చేసింది. మహిళలు వైద్యవిద్యలలో 29 శాతం ఉంటే, నర్సింగ్ సిబ్బందిలో 80 శాతం ఉన్నారు. ఇక 100 శాతం ఆశావర్కర్లుగా ఉన్నారు. ఆరోగ్య సంరక్షణలో నాయకత్వ స్థానాల్లో కేవలం 18 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. ఈ రంగంలో పురుషుల కంటే 34 శాతం స్త్రీలు తక్కువ సంపాదిస్తున్నారు.


* హెల్త్ కేర్ నివేదిక

లాభాపేక్ష లేకుండా, అన్ని రంగాలలో సామాజిక మార్పునకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థ దస్రా. ఈ సంస్థ హెల్త్ కేర్ రంగంపై దృష్టి పెట్టి, ఓ నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో పొందుపర్చిన విషయాలలో ముఖ్యంగా గమనించాల్సింది మహిళలకు రోల్‌మోడల్స్ లేకపోవడం, వారి పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం గురించి సరైన అవగాహన లేకపోవడం అని పేర్కొంది.

ఫ్రంట్‌లైన్ పాత్రలలోనే..

భారతదేశంలో ప్రధానమైన హెల్త్‌కేర్ రంగం కొన్ని సంవత్సరాలుగా సాంకేతికత, నైపుణ్యాలు, విద్య, వృత్తిపరంగా గణనీయమైన అభివృద్ధి, విస్తరణను చవిచూసింది. అయినప్పటికీ ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళలు తక్కువ ఆదాయాలను పొందే ఫ్రంట్‌లైన్ పాత్రలలో కనిపిస్తున్నారని దస్రా నివేదిక సూచిస్తుంది. దస్రా డైరెక్టర్ శైలజా మెహతా మాట్లాడుతూ 'ఆరోగ్య సంరక్షణ రంగంలో మహిళల నాయకత్వంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం. ఎందుకంటే, ఇతర రంగాలను కూడా హెల్త్‌కేర్ ప్రభావితం చేయడమే కారణం. లింగ సమానత్వం విషయంలో మా పనిలో మేం మహిళల పురోగతికి సంబంధించిన గ్యాప్‌పై దృష్టి పెట్టాలనుకున్నాం' అని తెలిపారు.

అతి తక్కువ శాతం

నివేదిక ఫలితాల ప్రకారం మొత్తం హెల్త్‌కేర్ వర్క్ ఫోర్స్‌లో 54 శాతం ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ సెక్టార్‌లో మహిళలు దాదాపు 25 నుంచి 30 శాతం నాయకత్వ స్థానాలను ఆక్రమించారు. ఫార్మాస్యూటికల్, బయోటెక్ రంగాలలో 5 నుంచి 10 శాతం మాత్రమే నాయకత్వపాత్రల్లో మహిళలు ఉన్నారు. మార్కెటింగ్ కార్యకలాపాల స్థానాల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రవేశ స్థాయి స్థానాల్లో మహిళలు 40 నుంచి 50 శాతం ఉండగా, సీనియర్ పాత్రలలో ఈ శాతం గణనీయంగా 15 నుంచి 20 శాతానికి పడిపోయింది.

పరిమిత ప్రాధాన్యం

మహిళలు ఆర్ అండ్ డి, నర్సింగ్, హెచ్‌ఆర్, పరిపాలన, నాణ్యత హామీ, చట్టపరమైన, నియంత్రణ వ్యవహారాలు వంటి విధుల్లో బాగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇవి పరిమిత ప్రభావాన్ని కలిగి ఉంటాయి. ముఖ్యంగా ఎంట్రీ లెవల్ హెచ్‌ఆర్ పాత్రల కోసం మహిళలకు ప్రాధాన్యత ఉంటుంది. దీని ఫలితంగా గణనీయంగా 70-80 శాతం ప్రాతినిధ్యం ఉంది. ఇదే నాయకత్వ స్థానాల్లో 20 నుంచి 30 శాతానికి పడిపోతుంది. నివేదిక ఫలితాలు, రోగుల సేవా బృందాలు, ఎఫ్ అండ్ బి మొదలైన వాటిలో ఇదే విధమైన నమూనాను గమనించాయి. ప్రవేశ స్థాయులలో 40 నుంచి 60 శాతం మహిళలను ప్రాధాన్యంగా నియమించుకుంటారు. అయితే సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ స్థాయులకు వారి పురోగతి పరిమితంగా ఉంది. ఇది 15 నుంచి 20 శాతానికి మాత్రమే చేరుకుంది.

రోల్ మోడల్స్ లేకపోవడమే..

లీడర్‌షిప్ క్వాలిటీ పెంపొందించుకోవడానికి మహిళలకు ప్రధాన అవరోధం రోల్ మోడల్స్ లేకపోవడమే. మహిళల పనిని తక్కువ అంచనా వేయడం, అంతర్గత పక్షపాతాలు, లింగ సమానత్వం, వైవిధ్యం గురించి నమ్మదగిన సాంస్కృతిక కథనం లేకపోవడం అని నివేదిక హైలైట్ చేసింది. శైలజా మెహతా మరిన్ని వివరాలు చెబుతూ 'అడ్డంకులు చాలా రెట్లు ఉన్నాయి. మహిళలు నిజంగా ప్రభావవంతంగా ఉన్నారా.. మంచి నాయకులు కాదా... అని ప్రశ్నించే మూస పద్ధతి కూడా ఒక కారణంగా ఉంది. మహిళల నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రతికూల పక్షపాతాలు, నిబంధనలు, ప్రవర్తనలు, ఊహాజనితాలు ఎన్నో ఉన్నాయి. వీటిని వదులుకోవడం అంత సులభం కాదు. సంస్థలు మెరుగైన వ్యాపారం కోసం ఆలోచిస్తాయే తప్ప మహిళా ఉన్నతిని పెద్దగా పట్టించుకోవు. హెల్త్‌కేర్ రంగంలో మహిళలు లీడర్‌షిప్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. భారతదేశంలో చాలా మంది మహిళలకు వారి ఆకాంక్షలకు కఠినమైన అడ్డంకులు ఉంటాయి. మహిళల లక్ష్యం నర్సు కావడమే అన్నట్టుగా ఉంటుంది. మేనేజర్‌గా లేదా సీఇవోగా ఉండటానికి వారికి అవకాశం ఇవ్వరు.

'మహిళలు తమ పరిమితులను దాటి, విస్తరించాలి. అడ్డుగోడలను, నిబంధనలను తొలగించుకుంటూ తమను తాము ప్రోత్సహించుకుంటూ ముందడుగు వేయాలి. అప్పుడే భవిష్యత్తు తరాలకు రోల్‌మోడల్స్‌గా నిలుస్తారు' అని చెబుతున్న దస్రా నివేదిక మనందరినీ ఆలోచింపజేస్తుంది.